# పరీక్ష

లేడీస్ క్లబ్ ఆవరణలో, ఓ మూలగా పొగడ చెట్టు కింద కుర్చీలలో కూర్చుని, కబుర్లు చెప్పుకొంటున్నారు వాళ్లు నలుగురూ.

ప్రెసిడెంటు లీలావతి, "ఈ మగవాళ్లని నమ్మశక్యం కాదు! పెళ్లాం పిల్లలంటే ఎదురుగా ఎంత ప్రేమ నటించినా, నిజ స్వరూపాలు అప్పుడప్పుడు బయటపడ్తాయి", అన్నది, నల్ల కళ్ల జోడుని సెంటు వాసనలు వెదజల్లే సిల్కు రుమాలుతో తుడుచుకుంటూ.

సెక్రటరీ చంద్రకళా, ట్రెజరర్ సరోజాదేవీ లీలావతిని సమర్థించారు.

"అందరు మగవాళ్లూ అంటే నేనొప్పుకోను. ఉదాహరణకి మా ఆయన్నే తీసుకోండి. ఆయనంత మంచివారూ, ప్రేమతో చూసేవారూ మరొహరుండరు!" శారద చాలా గర్వంగా అంది.

లీలావతి మొహంలో రంగులు మారాయి. అయినా లేని నవ్వు తెచ్చిపెట్టుకొంటూ- "ఎవరి మొగుళ్లని గురించి వాళ్లు అలాగే చెప్పుకొంటారు. అయినా నేనన్నట్లుగా, వాళ్ల అసలు స్వరూపాల్ని కనుక్కోవడం చాలా కష్టం!" అంది.

"అదేమంత కష్టంకాదు. మీరు ఊఁ, అంటే మన నలుగురి భర్తల్నీ ఇట్టే పరీక్షిద్దాం . అప్పుడే నేనో పథకం ఆలోచించాను", అంది చంద్రకళ.

"వో ప్రశ్నాపత్రం తయారుచేసి యివ్వడమేగా! ఈ మధ్య పత్రికల్లో ఇటువంటి పరీక్షలు చాలా యిస్తున్నారు" అన్నది సరోజాదేవి, అదేమంత ఘనకార్యం అన్నట్లుగా.

"అటువంటిదేమీ కాదు. ఇది చాలా కఠినమైన పరీక్ష. ఇందుకు మగ సహాయం కూడా కావలిసి వస్తుంది. అందుకు ఏర్పాట్లు మా తమ్ముడి ద్వారా చేయిస్తాను. ఇలా దగ్గరగా రండి. వివరాలు చెప్తాను"- చంద్రకళ ధీమాగా అనడంతో, మిగిలిన ముగ్గురూ కుర్చీలు దగ్గరగా జరుపుకొన్నారు.

★ ★ ★ ★

"ఎందుకు నన్నిలా బంధించి తీసుకొచ్చారు ? నేను మీకేం అపకారం చేశానని ?' లీలావతి భర్త చలపతి, కుర్చీలో గింజుకొంటూ అడిగాడు ఎదురుగా ఉన్న ఇద్దరు ముసుగు మనుషుల్నీ.

"మీ దగ్గర దాపరిక మెందుకు? మేం పాకిస్తాన్ గూఢచారులం. మీ ఫ్యాక్టరీ తయారు చెయ్యబోయే కొత్త యంత్రం తాలూకు వివరాలన్నీ మాకు కావాలి" అన్నాడు ఇద్దరిలోనూ బలంగా ఉన్న నాయకుడు.

"అవి యిచ్చి నా యజమానులకీ, దేశానికీ ద్రోహం చెయ్యమంటారా!" చలపతి వీల్లేదన్నట్లు అన్నాడు.

"మీరిలా అంటారని ఊహించాం. అయితే మీకు మరో దారి లేదు. ఎంచేతనంటే,

మీ భార్య లీలావతి మా బందీగా ఉంది. మీరు నిరాకరిస్తే, ఆవిడ మీకు దక్కదు! ఆలోచించుకోండి'

"మీరు అబద్ధమాడుతున్నారు. మా ఆవిడ..." చలపతి యింకా ఏదో అనబోతుండగా... మరో యిద్దరు ముసుగు మనుషులు స్పృహ తప్పి పడున్న లీలావతిని వో స్ట్రెచర్ మీద మోసుకొచ్చారు. చలపతి కొయ్యబారిపోయాడు. నాయకుడికి చేతులు జోడించి, "ఆమెకు మీరేమీ హానిచెయ్యవద్దు. మీరడిగిన వివరాలు అందజేస్తాను" అన్నాడు బలహీనంగా.

స్పృహ తప్పినట్లు నటించిన లీలావతి గర్వంతో పొంగిపోయింది. అయితే ఉత్సాహాన్ని బలవంతంగా ఆపుకొని, బిగపట్టుకొని పడుకుంది.

"మీరిక్కడే ఉండండి. మరో గంటలో మిమ్మల్ని వదిలేస్తాం. రేపు సాయంత్రానికల్లా మీరు వివరాలందించాలి. అప్పుడే మీ భార్య మీకు దక్కుతుంది"- నాయకుడీ మాటలని, బయటకు దారి తీశాడు. మిగిలిన వాళ్లు లీలావతిని అక్కణ్ణించి మోసుకొని పోయారు.

★ ★ ★ ★

"ఛస్తే మా శాఖకి సంబంధించిన పత్రాలు మీకు యివ్వను!" రామచంద్రం బింకంగానే అన్నాడు.

"మీరు ఆ కిటికీలోంచి పక్క గదిలోకి చూడండి. ఆ తర్వాత మీ యిష్టం" అన్నాడు నాయకుడు.

రామచంద్రం నీరసంగా పడుకొంటూ కిటికీ దగ్గరకు వెళ్ళాడు. మంచం మీద కాళ్ళూ చేతులూ కట్టబడి ఉన్న చంద్రకళనీ, పదేళ్ళ కొడుకునీ చూస్తూనే బావురుమన్నాడు. నాయకుడు ఓదార్పుగా రామచంద్రం భుజం మీద చెయ్యి వేస్తూ దూరంగా తీసుకు పోయాడు.

"మీ పెళ్ళాం బిడ్డలు కావాలంటే, మేమన్న పని మీరు చేసి తీరాలి" అన్నాడు.

"మీరడిగిన వివరాలివ్వడానికి నాకు రెండు రోజులు వ్యవధి కావాలి" రామచంద్రం సణుగుతూ అన్నాడు.

"నిరభ్యంతరంగా! అందాకా వాళ్ళిద్దరూ 'మా అతిధులుగా ఉంటారు" అని, నాయకుడు గది బయటకు నడిచాడు.

సెక్రటరీ చంద్రకళ లీలావతి వైపు గర్వంగా చూసింది.

★ ★ ★ ★

"ఏమండీ రాజారావుగారూ, యింతకీ మీరు లొంగనంటారు! అయితే మీ భార్య సరోజ గారి మీద ఆశ వదులుకోండి" నాయకుడు కటువుగా అన్నాడు.

"సరోజనా! ఎలా తీసుకొచ్చారు?!" రాజారావు ఆశ్చర్యంగా అడిగాడు.

"మిమ్మల్ని తీసుకొచ్చిన విధంగానే - మోసగించి. వ్యర్థమైన ప్రసంగం అనవసరం. మీ కంపెనీ తయారు చేసిన ఆ మాయదారి ఇంకు ఫార్ములా మాకు కావాలి. మా మిలిటరీ

ప్రెసిడెంటు మళ్లా ఎలక్షన్లు జరిపిస్తున్నాడు. ఆ ఇంకు అవసరం మాకెంతైనా ఉంది. మీరు ఫార్ములా యిచ్చిన గంటకల్లా, మీ సరోజ మీ వద్దకు చేర్చబడుతుంది."

"దుర్మార్గులారా! మీరు కట్టిన కట్లతో కాళ్ళూ చేతులూ మండుతున్నాయి. నన్ను కూడా మా ఆయన దగ్గరే పడేయండి"- పక్క గదిలోంచి వినవచ్చాయి సరోజాదేవి మాటలు. రాజారావు చేతుల్లో మొహం దాచుకొంటూ, కుర్చీలో కూలబడ్డాడు. "సరోజనేమీ చెయ్యకండి. మీరేం చెయ్యమంటే అది చేస్తాను." గట్టిగా అరిచాడు.

తన భర్తేమీ తక్కువ కాదన్నట్లుగా మిగిలినవారివైపు చూసింది సరోజాదేవి.

★ ★ ★ ★

"ఇంతకీ, తూర్పు పాకిస్తాన్‌లో అకాల వర్షాలు మా భారతదేశం కురిపించిన విధానం మీకు కావాలంటారు, అవునా? మా మెటీరియాలజీ డిపార్టుమెంట్ ఎన్నో సంవత్సరాలు కష్టపడి సాధించిన ఫలితాన్ని, మీకు వొలిచిన అరటిపండులా చేతిలో పెట్టడమనేది అసంభవం!"- శారద మొగుడు వరదరాజు అన్నాడు కోపంగా.

"మీరిచ్చి తీరుతారు! దానికి తగ్గ సాధనం మా దగ్గర ఉంది" అంటూ నాయకుడు తన అనుచరులకి సంజ్ఞ చేశాడు. వాళ్లు, చేతులు వెనక్కి విరిచి కట్టబడి ఉన్న శారదనీ, భయంగా తల్లి కాళ్లను చుట్టుకొని నడుస్తున్న నాలుగేళ్ళ పాపనీ తీసుకొచ్చారు. వరదరాజు బలంగా గింజుకొన్నాడు. కుర్చీకి గట్టిగా కట్టేయడం వల్ల, కుర్చీతో సహా కిందకు పడ్డాడు. శారద గొల్లుమంటూ ఏడుపు మొదలెట్టింది. ముసుగు మనుషులు కుర్చీతో సహా వరద రాజుని లేవనెత్తి కూర్చోపెట్టారు. "వాళ్ళ ప్రాణాల మీద మీకేమాత్రం ఆశ ఉన్నా, మేం అడిగినది మీరు తప్పకుండా చెప్పాలి"- నాయకుడు వికటంగా నవ్వుతూ అన్నాడు.

వరదరాజు ముసుగు మనిషి మొహం మీద ఉమ్మేస్తూ అన్నాడు- "నన్నూ, నా కుటుంబాన్నీ సర్వనాశనం చేసినా లొంగేది లేదు. నా దేశం ముందర నా పెళ్లాం బిడ్డల ప్రాణాలొక లెక్క కాదు."

"మీకు మరో గంట వ్యవధి యిస్తున్నాం. ఆలోచించుకోండి", అంటూ నాయకుడు శారదనీ, పాపనీ బలవంతంగా బయటకు పంపేసి, వరదరాజుని గదిలో పెట్టి గడియ వేశాడు.

"మీరు గంట కాదు-వెయ్యి సంవత్సరాలు గడువిచ్చినా నా నిర్ణయం మార" దంటూ వరదరాజు కేకలు వెయ్యసాగాడు మూసిపెట్టిన గదిలోంచి.

శారదకు ఈ మాటు నిజంగా ఏడుపొచ్చింది. ఉడుకుమోతుతనంతో, మొగుడి మీద కోపంతో, మొహం ఎర్రబడిపోయింది. లీలావతి, చంద్రకళ, సరోజాదేవి - శారద వైపు నవ్వుతూ విజయగర్వంతో చూసినా, మీ మొగుళ్ళందరూ దేశద్రోహులని శారద ఎక్కడంటుందేమోనని లోపల కొద్దిగా భయపడ్డారు.

నాలుగు మూలల్నించీ పోలీసులు వచ్చి ముసుగు మనుషుల్ని పట్టేసి అందర్నీ విడిపించేశారు. "మాకు సకాలంలో సమాచారం అందడం వల్ల మిమ్మల్ని రక్షించగలిగాం.

అయితే ఈ విషయం గురించి మీరు ఎవరితోనూ చర్చించకూడదు. ఎవరికీ తెలియనీయ కూడదు. ఇది మన ప్రభుత్వం ఆజ్ఞ. ఈ విషయం ఏ మాత్రం బయటకు పొక్కినా, మిగిలిన ముత్యాలు జాగ్రత్తపడి పోతాయి. మీరిక వెళ్ళవచ్చు" అంటూ ఇనస్పెక్టర్ అందర్నీ పంపించేశాడు.

లీలావతీ, చంద్రకళా, సరోజా దేవీ వాళ్ళు ఎక్కిన టాక్సీల్లో డ్రైవర్లున్నారన్న ధ్యాసే లేకుండా భర్తల్ని కావలించేసుకొన్నారు. పెళ్ళాం భుజం మీద ఆప్యాయంగా చెయ్యి వెయ్యబోయిన వరదరాజుని విసిరికొట్టి, దూరంగా జరిగింది శారద.

ఇది జరిగిన కొన్ని రోజులకే -

ఓ సాయంత్రం లీలావతి మేడ మెట్ల మీద నుంచి జారిపడి కాలి ఎముక విరక్కొట్టుకుంది. పనిమనిషి క్లబ్‌లో ఉన్న చలపతికి ఫోను చేసింది. "నువ్వు డాక్టరుకు ఫోను చెయ్యి. నేనిప్పుడే వస్తున్నాను" అని చెప్పిన చలపతి, పేకాట తాపీగా ఆడి రాత్రి పన్నెండింటికి ఇల్లు చేరాడు. పెళ్ళాం నర్సింగ్ హోంలో కట్టుతో పడుందని తెలుసుకొని, రాత్రంతా శుభ్రంగా నిద్రపోయి ఉదయం చూడ్డానికి వెళ్ళాడు. లీలావతి ఈ సంగతి ఎవరితోనూ చెప్పుకోలేదు.

చంద్రకళ కొడుకు బంతి ఆడుతూ పక్కింటివాళ్ల కిటికీ అద్దాల్ని బద్దలు కొట్టేశాడు. ఆ యింటి మీనాక్షమ్మ చంద్రకళ మీద దెబ్బలాటకు వచ్చింది. చంద్రకళ కొడుకుని సమర్థించుకొంటూ, నేరాన్ని మీనాక్షమ్మ కొడుకు మీదకే నెట్టి, ఆవిడ నోరు మూయించి పంపింది విజయగర్వంతో. అయితే ఆఫీసు నుంచి తిరిగి వచ్చిన రామచంద్రానికి మీనాక్షమ్మ మొగుడు మళ్ళీ ఫిర్యాదు చేశాడు. రామచంద్రం పెళ్ళాన్నీ, కొడుకునీ పక్కింటి ఆయన ముందరే నాలుగు తిట్టి వాళ్ల కిటికీ బాగు చేయించేశాడు. చంద్రకళ ఈ విషయాన్ని ఎవరికీ తెలియనీయలేదు.

స్నేహితురాళ్ల దగ్గర గొప్ప కోసం, మొగుడి కోటులోంచి వంద రూపాయలు తీసి విరాళంగా యిచ్చేసింది సరోజాదేవి. ఆ రోజు రాత్రి రాజారావుచే గంటన్నరసేపు మొహం వాచేటట్లు తిన్న తిట్లు (దవడ మీద ఓ రెండు అట్లు కూడా), సరోజాదేవి తనలోనే పదిలంగా, రహస్యంగా దాచేసుకొంది.

శారదా, పాపా - యిద్దరూ విష జ్వరంతో ఒకేసారి మంచాన పడ్డారు. వాళ్లకి జ్వరం తగ్గేవరకూ వరదరాజు దగ్గరుండి సేవచేశాడు. వారం రోజులకి వాళ్ళిద్దరూ తేరుకొన్నారు. వరదరాజు ఇద్దర్నీ వెంటబెట్టుకొని తిరుపతి వెళ్లి వచ్చేశాడు. గుండుతో ఉన్న వరదరాజు ఎంతో అందంగా కనిపించాడు శారదకి. శారద ఈ విషయం అందరితోనూ గొప్పగా చెప్పుకొంది.

క్లబ్‌లో వాళ్లు నలుగురూ పొగడ చెట్టు కింద మాట్లాడుకొంటున్నారు.

"ఈ మగవాళ్లని అర్థం చేసుకోవడం చాలా కష్టం!"-అంటోంది లీలావతి గుంభనగా.

అవునన్నట్లుగా తలలూపారు మిగిలిన ముగ్గురూ!

('ఆంధ్ర సచిత్ర వార పత్రిక' : 14-1-1972)